షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Happy Work Anniversary 1st Year
Good for Health
Best for Readers RK THE POWER OF PEN

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 11 ఫిబ్రవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు
VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-



## కంబాళాపురం తండాలో తాగు నీటి కటకట పట్టించుకోని అధికారులు

షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి ఫిబ్రవరి 10

శ్రీరంగాపురం మండల పరిధిలోని కంబాళాపురం తండాలో గత వారం రోజులుగా త్రాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షుడు గౌడు నాయక్ తెలిపారు. ఈ విషయంపై మండల అధికారులను సంప్రదించగా వారం రోజుల నుంచి స్పందించడం లేదని వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తండాలో తాగునీటి ఎద్దడి నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో గత వారం రోజులుగా కరణం వీధికి నీళ్లు రావడంలేదని,తమ వీధికి వచ్చే వాటర్ పైపు లైన్ లీకేజీ వల్ల తమ వీధికి నీళ్లు రావడం లేదని వెంటనే లీకేజీ సమస్యను పరిష్కరించి తమ వీధికి నీళ్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వీధి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

# హస్తంలో కిరికిరి?

- కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?
- పదేళ్ల తర్వాత రాకరాక అధికారం వచ్చింది.
- మరి దాన్ని నిలుపుకోవాలంటే ఏం చేయాలి.. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలన్నారు
- మరి కాంగ్రెస్ వచ్చింది.. కానీ పార్టీలో ఏం జరుగుతోంది?
- బలంగా ఉన్నామనే చెప్పుకోవాలి.. లోపాలుంటే అంతర్గతంగా సరిదిద్దుకోవాలి.
- ఒక్క లైన్‌పై ఉండాల్సిన పరిస్థితుల్లో లైన్ దాటితే ఏమవుతుంది అనుకోవచ్చు. కానీ జరిగేది జరుగుతుంది



హైదరాబాద్

తెలంగాణ ఇచ్చిన పార్టీగా పదేళ్ల తర్వాత రాకరాక అధికారం వచ్చింది. మరి దాన్ని నిలుపుకోవాలంటే ఏం చేయాలి.. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలన్నారు. మరి కాంగ్రెస్ వచ్చింది.. కానీ పార్టీలో ఏం జరుగుతోంది? ఏడాదికే జనంలో పలచన అయిపోయేంతగా లుకలుకలు బయటపడాలా? బలహీనంగా ఉన్నా.. బలంగా ఉన్నామనే చెప్పుకోవాలి.. లోపాలుంటే అంతర్గతంగా సరిదిద్దుకోవాలి.. కానీ బహిరంగ విమర్శలు దేనికి? అందరికీ నచ్చే.. అందరూ మెచ్చే నిర్ణయాలే కదా ఇప్పుడు జరుగుతున్నాయి. అంతిమంగా ప్రజలకు మేలు జరిగేవే చేస్తున్నారు కదా.. ఒక్క లైన్ పై ఉండాల్సిన పరిస్థితుల్లో లైన్ దాటితే ఏమవుతుంది అనుకోవచ్చు. కానీ జరిగేది జరుగుతుంది. అందుకే అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చేందుకు నిర్వహించిన సీఎల్పీ సమావేశం చాలా ప్రశ్నలకు సమాధానమిచ్చింది. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత పెరిగేలా వాతావరణం కల్పించింది.రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా సలహాలు, సూచనలు ఇస్తే తప్పకుండా తీసుకోవాలి. ఎదుటివారు చెప్పేది సీఎం సావధానంగా వింటున్నారు. అందరికీ అందుబాటులో ఉన్నారు. ఎవరు వచ్చినా కాదనకుండా కలుస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు కదా. తమ నియోజకవర్గానికి ఇది కావాలి అని వెళ్తే కాదనకుండా చేస్తున్న పరిస్థితి చూడడం లేదా? ప్రస్తుతం కాంగ్రెస్ లో సిచ్యువేషన్ ఎలా ఉందంటే చాలా మంది రిలాక్స్ మోడ్ లో కనిపిస్తున్నారు. అందుకే లేటెస్ట్ గా పెట్టిన సీఎల్పీ మీటింగ్ ఒక అలర్ట్ అయితే ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21 వేల కోట్ల రుణమాఫీ చేసినా.. 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినా దాన్ని అందిపుచ్చుకోవడం లేదన్న చర్చ అయితే నడుస్తోంది. పైరవీలు, పరేషాన్లు ఎందుకన్న టాక్ కూడా నడుస్తోంది. జనంలో - మిగతా 3లో

## దాడి చేసిన వారిపై
# కఠిన చర్యలు

- రంగరాజన్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్.. కీలక ఆదేశాలు
- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్
- ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి
- రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించిన ముఖ్యమంత్రి
- దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



హైదరాబాద్

మొయినాబాద్ మండలం చిలుకూరు శ్రీబాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి నేపథ్యంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. రంగరాజన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. ఆ దాడికి సంబంధించిన వివరాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు రంగరాజన్‌ను ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ అగ్రనేతలు పరామర్శించారు. ఈ దాడి ఘటనను బీఆర్ఎస్ నేతలు ఖండించారు. - మిగతా 3లో

## హిందూ బిసి, ముస్లిం బిసి లని ప్రపంచంలో ఎక్కడైనా ఉందా...?

**బీసీలను నష్టపరిచే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం...**

**బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ ...**



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు ఫిబ్రవరి 10** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బీసీ సమాజానికి తీవ్ర అన్యాయం చేసేలా ఉందని, సర్వేలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి చూపించారని, హిందూ బిసి, ముస్లిం బీసీ లని ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కొత్త పదాన్ని సృష్టించారని , దీని వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ సంఘాల నేత ఎన్నం ప్రకాష్ అన్నారు. సోమవారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బీసీలకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తే నేడు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన లెక్కలు , వివరించిన తీరును చూస్తుంటే బీసీ సమాజానికి తీవ్ర నష్టం చేకూర్చేలా ఉందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 51 శాతం బీసీలు ఉంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 46 శాతం లా చూపించారని, దాదాపు 21 లక్షల మంది బీసీల జనాభా తగ్గిపోయిందని ఇది దారుణమైన విషయమని అన్నారు రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బిసి లను దెబ్బతీయడానికి ప్రభుత్వం ఈ కుల గణన సర్వే చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి అని అన్నారు. బీసీ ల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మళ్ళీ రీ సర్వే చేయాలనీ,అలాగే హిందూ ముస్లిం , బీసీ పదాన్ని కూడా తొలగించాలని అయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో మొండిగా వ్యవహరించి బీసీ ల కు అన్యాయం చేయాలని చుస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని భారీ ఎత్తున ఉద్యమిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## అమెరికా బాటలోనే బ్రిటన్



- అక్రమ వలసదారులకు యూకే కొరడా..
- పార్లమెంటులో కొత్త బిల్లు!
- బ్రిటన్ కూడా అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతోంది
- వ్యాపార సంస్థలపై ఇటీవల కాలంలో నిర్వహించిన రెయిడ్‌లు విజయవంతం అయ్యాయయని అక్కడి ప్రభుత్వం తాజాగా వెల్లడి
- వలసలకు అడ్డుకట్ట వేసేలా ఈ చట్టంలో అనేక కఠిన నిబంధనలు



## ప్రపంచంలో అతిపెద్ద ట్రాఫిక్ జామ్

- 300 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- ప్రయాగ్ రాజ్ వెళ్లే హైవేపై మొత్తం నిలిచిపోయిన వాహనాలే!
- ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక రోడ్డుపైనే నిలిచిన జనం
- సంగం రైల్వే స్టేషన్ మూసివేసిన అధికారులు

# మణిపూర్‌లో కొత్త పొత్తు!

- ఇలా రాజీనామా చేశారో లేదో.. మళ్లీ జత కట్టేశారు..!
- ఎన్పీపీ బీజేపీతో జత కట్టడానికి సై అంటోంది.
- మూడు నెలలుగా అక్కడ అధికార బీజేపీకి దూరంగా ఉంటూ వస్తున్న ఎన్పీపీ..
- బీరెన్ సింగ్ రాజీనామాతో మళ్లీ తమ పొత్తును కొనసాగిస్తామంటోంది.
- మణిపూర్‌లో చెలరేగిన హింస అరికట్టడంలో బీరెన్ సింగ్ విఫలమయ్యారనే ఆరోపణలు



# అమెరికా బాటలోనే బ్రిటన్



**ఇంటర్నెట్ డెస్క్:** అమెరికా బాటలోనే పయనిస్తున్న బ్రిటన్ కూడా అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ వలసదారులను నియమించుకునే వ్యాపార సంస్థలపై ఇటీవల కాలంలో నిర్వహించిన రెయిడ్‌లు విజయవంతం అయ్యాయయని అక్కడి ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసల విభాగం అధికారులు ఏకంగా 5 వేల సార్లు రెయిడ్లు నిర్వహించారని పేర్కొంది. అక్రమ వలసదారులకు పని కల్పించే నెయిల్ బార్స్, షాపులు, వేప్ షాపులు, రెస్టారెంట్లు, కార్ వాష్ షాపుల్లో మెరుపు తనిఖీలు నిర్వహించి 4 వేల అరెస్టులు చేసినట్టు పేర్కొంది. కన్జర్వేటివ్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి కంటే అధికంగా అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్టు పేర్కొంది. ఈ కాలంలో మొత్తం 16 వేల మంది అక్రమ వలసదారులను దేశం నుంచి బహిష్కరించినట్టు కూడా వెల్లడించింది. అక్రమ వలసదారులను సొంత దేశాలకు తరలిస్తున్న వీడియో ఒకటి విడుదల చేద్దామని యూకే ప్రభుత్వం భావిస్తుండగా అప్పుడే విమర్శలు మొదలయ్యాయి మరోవైపు, అక్రమవలసలపై ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరిని య్యూకె హోమ్ ఆఫీస్ మినిస్టర్ ఆంజెలా ఈగల్ సమర్థించుకున్నారు. "నిబంధనలను గౌరవించి అమలు చేసే వ్యవస్థ బ్రిటన్‌లో ఉంది. నిబంధనల అమలు అందరికీ స్పష్టంగా కనిపించడం కూడా ముఖ్యమే. యూకేపై ఆశలతో అక్రమంగా ఇక్కడకు వచ్చే వారి భవితవ్యం ఏమిటో తెలిసేలా సందేశం పంపించాలి" అని ఆమె పేర్కొన్నారు. బ్రిటన్‌లో సులువుగా బతుకుతెరువు లభిస్తుందన్న భావన అక్రమ వలసదారులను యూకేవైపు ఆకర్షిస్తోందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో, అక్రమ వలసదారులకు ఉపాధి కల్పించే సంస్థలు, వ్యాపారాలను టార్గెట్ చేస్తోంది. గతేడాది ఇంగ్లిష్ ఛానల్ దాటి 38 వేల పైచిలుకు మంది బ్రిటన్‌లో ప్రవేశించారు. ఈ ప్రమాదకర ప్రయాణంలో మరో 70 మంది అసువులు బాసారు. అక్రమ వలసల వెనకున్న క్రిమినల్ గ్యాంగులు ప్రపంచ భద్రతకు ప్రమాదమని బ్రిటన్ ప్రధాని పేర్కొన్నారు. ఈ గ్యాంగులు ఉగ్రవాదులతో సమానమని వ్యాఖ్యానించారు. అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసే బిల్లు సోమవారం పార్లమెంటు ముందుకు రానుంది. వలసలకు అడ్డుకట్ట వేసేలా ఈ చట్టంలో అనేక కఠిన నిబంధనలను చేర్చారు. లేబర్ పార్టీకి సభలో ఉన్న మెజారిటీ రీత్యా ఈ బిల్లు సులభంగా పాసవుతుందని అక్కడి విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, మ మానవ హక్కుల సంఘాలు మాత్రం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉగ్రవాద చర్యల అడ్డుకట్టు వినియోగించే కఠిన నిబంధనలు ఇతర నేరాలపై ప్రయోగించడం విపరిణామాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నాయి.

# ప్రపంచంలో అతిపెద్ద ట్రాఫిక్ జామ్



**లక్నో:** ఉత్తర్ ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న ప్రపంచంలోని అతిపెద్ద అధ్యాత్మిక కార్యక్రమాల్లో ఒకటైన మహా కుంభమేళాకు వెళుతున్నారా? అయితే జాగ్రత్త. కుంభమేళా ముగింపు తేదీ గడువు సమీపిస్తున్న తరుణంలో ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ఫలితంగా కుంభమేళా జరిగే ప్రయాగ్ రాజ్ వెళ్లే మార్గంలో ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.


శనివారం నుంచి లక్షల వాహనాలు ప్రయాగరాజ్ వైపు మళ్లాయి. దీంతో భక్తులు త్రివేణి సంగమ్ (గంగ, యమునా, సరస్వతి నదుల సంగమం) వద్ద పవిత్ర స్నానమాచరించేందుకు సమయానికి చేరుకోలేకపోతున్నారు. రోజుల సమయం పట్టనున్నడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో ప్రయాగరాజ్ సంగమ్ రైల్వే స్టేషన్‌ను అధికారులు శుక్రవారం వరకు మూసివేశారు.

హైవేపై భారీ ట్రాఫిక్ జామ్ కారణంగా ముందుకు వెళ్లలేక, వెనక్కి తిరిగి రాలేక జనం అవస్థలు పడుతున్నారు. ఆకలిదప్పులతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ కదలడంలేదని, ప్రయాగ్ రాజ్ ఇంకా 300 కిలోమీటర్ల దూరం ఉందని ఓ వాహనదారుడు చెప్పారు. మరోవైపు, భక్తుల రద్దీ కారణంగా సంగం రైల్వే స్టేషన్ ను అధికారులు వచ్చే శుక్రవారం వరకు మూసివేశారు.

యూపీ సర్కారు వైఫల్యం వల్లే కుంభమేళాకు వెళుతున్న భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారని సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. హైవేపై ట్రాఫిక్ జామ్ వీడియోను షేర్ చేస్తూ... దీనికి సీఎం యోగి అసమర్థతే కారణమని మండిపడ్డారు. ట్రాఫిక్ జామ్ ను క్లియర్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభమేళా నిర్వహణలో యోగి ప్రభుత్వం విఫలమైందనే దానికి ఈ ట్రాఫిక్ జామే కారణమని అఖిలేశ్ చెప్పుకొచ్చారు. ప్రతిచోట వాహనాల రద్దీ నెలకొనడంతో భక్తులకు ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఔషధాలు, పెట్రోల్, డీజిల్ వంటివి అందటంలేదని, ఆహారం, విశ్రాంతి లేక భక్తులు నీరసించిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ తరుణంలో ఉత్తర ప్రదేశ్ సీఎం యోగీ ఆధిత్యనాథ్ సర్కార్‌పై సమాజవాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆకలి,దాహంతో ఇబ్బంది పడుతున్న భక్తులను మనవత్వంతో చూడాలి. సామాన్య భక్తులు మనుషులే కదా? వారికి కనీస సదుపాయాలు కల్పించారా? అని ప్రశ్నలు సంధించారు. అంతకుముందు కుంభమేళా ఏర్పాట్లపై అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు. ప్రయాగరాజ్‌లో ట్రాఫిక్ పరిస్థితి గురించి హైలైట్ చేస్తూ.. భక్తుల కోసం అత్యవసర ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రయాగరాజ్ ప్రవేశం సమీపంలో నవాబగంజ్‌లో 30 కిలోమీటర్లు, గౌహానియాలో 16 కిలోమీటర్లు,వారణాసి మార్గంలో 12 నుండి 15 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ ఉంది. ట్రాఫిక్ జామ్ వల్ల జనజీవనం స్తంభించింది. అందుకే ఉత్తర ప్రదేశ్‌లో వాహనాలకు టోల్ ఛార్జీల నుంచి విముక్తి కల్పించాలి. తద్వారా ప్రయాణ సమస్యలు, ట్రాఫిక్ జామ్‌ను తగ్గించవచ్చు. సినిమాల్లా వినోదానికి కూడా ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌ను వసూలు చేయనప్పుడు, వాహనాలకు టోల్ ఫ్రీ ఎందుకు చేయలేరు? అని పునరుద్ఘాటించారు.

# మణిపూర్‌లో కొత్త పొత్తు!



**ఇంఫాల్:** మణిపూర్ సీఎంగా బీరెన్ సింగ్ ఇలా రాజీనామా చేశారో లేదో.. ఎన్పీపీ బీజేపీతో జత కట్టడానికి సై అంటోంది. మూడు నెలలుగా అక్కడ అధికార బీజేపీకి దూరంగా ఉంటూ వస్తున్న ఎన్పీపీ.. బీరెన్ సింగ్ రాజీనామాతో మళ్లీ తమ పొత్తును కొనసాగిస్తామంటోంది. మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా చోటు చేసుకుంటున్న హింసాకాండలో భాగంగా బీజేపీకి దూరంగా ఉంటోంది ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన ఎన్పీపీ. మణిపూర్‌లో చెలరేగిన హింస అరికట్టడంలో బీరెన్ సింగ్ విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. దాంతోనే బీరెన్ సింగ్‌కు తమ మద్దతును ఉపసంహరించుకుంది ఎన్పీపీ. బీరెన్ నాయకత్వంలో మణిపూర్ అల్లర్లు చెలరేగినట్లు ఎన్పీపీ భావించింది. ఈ నేపథ్యంలో బీరెన్‌కు మద్దతును బహిరంగంగానే ఉపసంహరించుకుంది ఎన్పీపీ. మణిపూర్‌లో చెలరేగిన అల్లర్లను కట్టడి చేయడంలో విఫలమైనందున బీరెన్ రాజీనామా నిన్న( ఆదివారం) చేయక తప్పలేదు.

ఈరోజు(సోమవారం) బీజేపీతో జత కట్టేందుకు ఎన్పీపీ రెడీ అయ్యింది. తాము ఎన్డీఏలో భాగమేనని,కేవలం బీరెన్ సింగ్ నాయకత్వాన్నే వ్యతిరేకించామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్పీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ నూరల్ హసన్ ఓ ప్రకటన విడుదల చేశారు.మణిపూర్‌లో తిరిగి శాంతి నెలకొనడానికి 'బీరెన్ సింగ్ రాజీనామా అనేది ఆహ్వానించదగ్గ పరిణామం. మేము ఎప్పుడూ ఎన్డీఏలో భాగమే. బీజేపీతో కలిసి పనిచేస్తాం. మళ్లీమణిపూర్‌ను గాడిలో పెడతాం' అని అన్నారు. మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యే వై కేమచంద్ర సింగ్ మాట్లాడుతూ.. సీఎం ఎవరు అనే దానిపై హైకమాండ్ "నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. పార్టీ సభ్యులంతా తప్పకుండా బీజేపీ హైకమాండ్ నిర్ణయాన్ని గౌరవిస్తామని తెలిపారు. ప్రధానంగా మణిపూర్‌లో రెండు తెగల మధ్య చోటు చేసుకున్న వైరం కాస్తా పెద్దదై అల్లర్లు చెలరేగాయన్నారు. మొయితీ తెగ, కుకీ తెగల మధ్య వైరం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిందన్నారు.

కుకీలు ఉగ్రవాదులంటూ..

2022లా మణిపూర్‌లో జరిగిన ఎన్నికల్లో సీఎంగా బీరెన్ సింగ్‌నే బీజేపీ అధిష్టానం తిరిగి నియమించిన సంగతి తెలిసిందే. అయితే 2023 మే నెలలో ఘర్షణలు రాజుకున్నప్పుడు బీరెన్ సింగ్ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రెండు ప్రధాన తెగలు మొయితీ%-%కుకీలు ఘర్షణ పడుతున్నారన్న సంగతిని గుర్తించటానికే నిరాకరించారు. 'ఇదంతా కుకీ ఉగ్రవాదులకూ, భద్రతా దళాలకూ సాగుతున్న ఘర్షణ' అంటూ భాష్యం చెప్పారు. మొయితీకి చెందిన నేతగా కుకీల తీరుపై ఎలాంటి అభి ప్రాయాలైనా, అభ్యంతరాలైనా ఆయనకు ఉండొచ్చు.

కానీ సీఎం హోదాలో అలా మాట్లాడరాదన్న సంగతిని బీరేన్ గ్రహించలేకపోయారు. ఆ వెంటనే రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ముఖ్యమంత్రి ప్రకటనను తోసిపుచ్చారు. అవి స్పష్టంగా తెగల ఘర్షణలేనని చెప్పారు. మణిపూర్ హింసకు ఇంతవరకూ 260 మంది బలి కాగా, 60,000 మంది ఇప్పటికీ రక్షణ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. రాష్ట్రం రెండు తెగలమధ్యా చీలిపోయింది. ఒకరి ప్రాంతాల్లోకి మరొకరు వెళ్లే పరిస్థితి లేదు. ఇరవై నెలల నుంచి మహోగ్రంగా మండుతున్న మణిపూర్‌లో ఇంతవరకూ జరిగిన హింసాకాండకు క్షమాపణ కోరుతున్నానని నూతన సంవత్సర ఆగమనవేళ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ప్రకటించారు. అయినా అల్లర్లు అనేవి ఓ కొలిక్కి రాకపోవడంతో పాటు ఎన్పీపీ కూడా పట్టుబట్టుకుని కూర్చోని ఉండటంతో బీరెన్ రాజీనామా చేయకతప్పలేదు.

## యమునా శాపం తగిలింది.. అతిషితో ఎల్జీ



**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎవరూ కారణాలు వెతుక్కోరు. ఓటమి పాలైనప్పుడు మాత్రం అనేక కారణాలు తెరపైకి వస్తాయి. పదేళ్లకు పైగా అప్రతిహతంగా హస్తినను పాలించిన ఆమ్ ఆద్మీ పార్టీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయింది. 'యమునా' నది శాపం వల్లే 'ఆప్' ఓటమి పాలైనట్టు ఢిల్లీ మాజీ సీఎం అతిషితో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత సీఎం అతిషి తన రాజీనామాను సమర్పించేందుకు ఎల్జీని కలిశారు. ఈ సమయంలో ఎల్జీ అతిషితో మాట్లాడుతూ, యమునా నదిని శుభ్రపరచే ప్రాజెక్టును నిలిపివేయమని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన తర్వాత ఇద్దరం కలిశామని, అప్పుడు యమునా శాపం గురించి ఆయనను హెచ్చరించారని, తన మాటను పెడచెవిన పెట్టారని అతిషితో సక్సేనా చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యమునా నది శాపం గురించి కేజ్రీవాల్‌ను సక్సేనా హెచ్చరించినట్టు చెబుతున్న విషయం రెండేళ్ల క్రితం నాటిది. యమునా నది పునరుజ్జీవనానికి ఎల్జీ పర్యవేక్షణలో ఉన్నత స్థాయి కమిటీని 2023 జనవరిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. ఇందుకు తొలుత ఆప్ ప్రభుత్వం సహకరించింది. యమునా నది ఆక్రమణల తొలగించడం,11 కిలోమీటర్ల మేర శుభ్రం చేయడ జరిగింది. అయితే ఆ తర్వాత క్రమంలో ట్రిబ్యునల్ ఆదేశాలను సుప్రీంకోర్టులో ఆప్ ప్రభుత్వం సవాలు చేసింది. దీంతో ట్రిబ్యునల్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ప్రస్తుతం రెండేళ్లుగా ఆ స్టే కొనసాగుతోంది. ఎల్జీ పర్యవేక్షణలో పనులు జరిగితే తమ ప్రభుత్వానికి క్రెడిట్ రాదనే అభిప్రాయంతోనే ఆప్ సర్కార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందనే అపప్రదను మూటకట్టుకుంది. సుప్రీంకోర్టు రూలింగ్ తర్వాత ఒక సందర్భంలో కేజ్రీవాల్ కలిసినప్పుడు యమునా నది శాపం పెడుతుందని ఆయనను ఎల్జీ హెచ్చిరించినట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి దశలో యమునా నదీ జలాల అంశం కూడా తెరపైకి వచ్చింది. 'యమున'లో విషం కలుస్తోందంటూ హర్యానా ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ తప్పుపట్టడం, ఇది పెద్ద వివాదానికి దారితీయడం, ఆయన వ్యాఖ్యలపై హర్యానా ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం జరిగింది. యమునా జలాల శుద్ధీకరణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయామని కేజ్రీవాల్ చివరకు ఒప్పుకుంటూనే, మరోసారి అధికారమిస్తే మాట నిలుపుకొంటామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ...అప్పటికే యమునా జలాల విషయంలో జరిగిన డ్యామేజీ 'ఆప్'ను ఎన్నికల ఫలితాల్లో గట్టిగా దెబ్బతీసిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఇది సమాజం.. తలదించుకునే పనులు చేయకండి: సీఎం ఫడ్నవీస్ వార్నింగ్



**ముంబై :** భారత్‌లో ప్రముఖ యూట్యూబర్, బీర్ బైసెప్స్‌గా పాపులర్ అయిన కంటెంట్ క్రియేటర్ రణవీర్ అలహాబాదియాకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరికలు జారీ చేశారు. ఏమైనా మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. ఇది సమాజం.. తలదించుకునేలా వ్యవహరించకండి అని సీఎం ఫడ్నవీస్ హెచ్చరించారు. ఇంతకి ఏం జరిగిందంటే? ఇండియాస్ గాట్ టాలెంట్‌లో యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా నోరు జారారు. దీంతో అలహాబాదియాపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇండియాస్ గాట్ టాలెంట్‌లో రణ్‌వీర్ అలహాబాదియా ఓ కంటెస్ట్‌తో రాయలేని భాషలో ఓ జోకు వేశాడు. ఆ జోక్‌తో అలహాబాదియాతో సహా పక్కనే ఉన్న గెస్ట్‌లు, న్యాయనిర్ణేతలు సైతం పగలబడి నవ్వారు. ఆ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ కామెంట్స్ చెలరేగింది. పలువురు న్యాయవాదులు సైతం అలహాబాదియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలహాబాదియా చేసిన కామెంట్స్‌పై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు.' అలహాబాదియా చేసిన కామెంట్స్ గురించి నాకు సమాచారం అందింది. అయితే నేను ఆ వీడియోను చూడలేదు. చాలా అసభ్యకరంగా మాట్లాడారని, అలా మాట్లాడటం తప్పే అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది. కానీ మనం ఇతరుల స్వేచ్ఛను హరించకూడదు. ప్రతి ఒక్కరికీ పరిమితులు ఉంటాయి. ఎవరైనా వాటిని దాటితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని స్పష్టం చేశారు.

**అభ్యంతరకర వ్యాఖ్యలు.. యూట్యూబర్ క్షమాపణలు**

ఓ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా క్షమాపణలు తెలిపాడు. నెట్టింట పెద్దఎత్తున విమర్శలు రావడంతోపాటు ముంబయిలో పోలీసు కేసు నమోదు చేశారు. హద్దులు దాటినవారిపై చర్యలు తప్పవని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ హెచ్చరించిన క్రమంలో రణ్‌వీర్ అలహాబాదియా క్షమాపణలకు చెప్పక తప్పలేదు.

## కౌంటర్ రైలు టిక్కెట్ల కంటే ఆన్‌లైన్ టిక్కెట్స్ ఎందుకు ఎక్కువ రేటు.. మంత్రి క్లారిటీ



దేశంలో రైల్వే టికెట్ బుకింగ్ ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. గతంలో ప్రయాణికులు టికెట్లను కౌంటర్ వద్ద పోటీపడి నిలబడి, కొనుగోలు చేసేవారు. కానీ ప్రస్తుతం మాత్రం డిజిటల్ వ్యవస్థ పెరగడంతో ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిగా మారిపోయింది. అయితే ఈ కొత్త ఆన్‌లైన్ సౌకర్యం ద్వారా కౌంటర్ టిక్కెట్లతో పోల్చితే కొంచెం ఖరీదైనవిగా మారాయని, అనేక మంది ప్రయాణికులు అనుకుంటున్నారు.

**ఎందుకు ఖరీదైనవి**

కౌంటర్ ద్వారా టికెట్ తీసుకున్న ప్రయాణికులు, ఆన్‌లైన్ టిక్కెట్ల ఎక్కువ ధరలను చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల సంజయ్ రౌత్ (శివసేన) రాజ్యసభలో ప్రస్తావించారు. ఆయన ఆన్‌లైన్ టిక్కెట్లు, కౌంటర్ టిక్కెట్ల కంటే ఎక్కువ ధరలు ఎందుకు ఉంటున్నాయని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. ఆన్‌లైన్ టిక్కెట్లు (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) ద్వారా మాత్రమే బుక్ చేయవచ్చు. ఇది ఒక అధికారిక వెబ్‌సైట్, యాప్. ఇది టికెట్ బుకింగ్ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కానీ ఈ సౌకర్యాన్ని అందించడానికి చాలా ఖర్చులు చేస్తుంది. సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్, వెబ్‌సైట్ నిర్వహణ, సర్వర్ విస్తరణ, సెక్యూరిటీ మెజర్లు ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి.

## గొల్లపల్లి రాచర్ల కాలేజీ

# సమీపంలో పోలీసుల వాహనాల తనిఖీలు





**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి ఫిబ్రవరి 10** ఎల్లారెడ్డి పేట మండల గొల్లపల్లి రాచర్ల జూనియర్ కళాశాల సమీపంలో కరీంనగర్ కామారెడ్డి ప్రధాన రహదారి పై ఎల్లారెడ్డి పేట పోలీసులు వాహనాల తనిఖీలు సోమవారం సాయంత్రం ఆ మార్గంలో వెళ్ళే వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ తదితర డాక్యుమెంట్లను పోలీసులు పరిశీలించారు. ద్విచక్ర వాహనాల దారులు హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. సరైన డాక్యుమెంట్లు లేని వాహన దారులకు పోలీసులు చలాన్ లు విధించగ కొందరు వాహన దారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ట్రైని ఎస్సై, పలువురు కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

## రంగరాజన్ పై దాడి చేసిన

# వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి

**బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బుగ్గ కృష్ణమూర్తి శర్మ హెచ్చరిక**

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి ఫిబ్రవరి 10** దైవ కార్యక్రమాలతో నిత్యం భక్తులకు సేవలందిస్తున్న బ్రాహ్మణులపై దాడులకు దిగడం అమానుష చర్య అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఆన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ రంగరాజన్ పై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బ్రాహ్మణుల పై దాడులకు ప్రభుత్వానిదే బాధ్యత అని తెలిపారు. రంగరాజన్ పై దాడికి తెగబడ్డ వారిని అరెస్టులతో సరిపెట్టకుండా వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు, వైద్యులపై దాడులు జరిగితే ఎలా చట్టం తెచ్చారో బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులపై చట్టం తీసుకు రావాలని కృష్ణమూర్తి శర్మ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో సెక్యూరిటీ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పడేరా పిడుగు బాపని మీద అన్నట్లుగా సమాజంలో ముందుగా చులకనగా కనిపించేది బ్రాహ్మణులే నా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దాడులకు తెగ బడే వారికి దమ్ము ధైర్యం వుంటే ముందుగా అన్యాక్రాంతం అయిన ఆలయ భూములను తిరిగి ఆలయాలకు చెందేలా చూడాలన్నారు.సున్నిత మనస్కులు అయి నిత్యం భగవన్నామ స్మరణతో వుండే బ్రాహ్మణుల పై దాడులు చేసే వారు ధర్మాను గ్రహానికి లోను కావద్దని హితవు చెప్పారు. అలుగుటయే ఎరుగని అజాత శత్రువే అలిగిన నాడు ఎలా వుంటుంది అంటే బ్రాహ్మణులు పరశు రాముడి అవతారం ఎత్తి ధర్మ ద్రోహులను దునుమాడే పరిస్థితి తీసుకు రావద్దని కృష్ణమూర్తి శర్మ హెచ్చరించారు. బ్రాహ్మణులపై దాడులకు దిగినా ఎవరి పాపాన వారే పోతారు అన్నిటినీ దేవుడే చూసుకుంటాడన్నా పాత రోజులు కావు ఇవి అని ఆన్నారు. బ్రాహ్మణులకు ఆగ్రహం కలిగి అన్ని పూజా కైంకర్యాలను,ఇళ్ళల్లో శుభ కార్యకార్యక్రమాలను చేయకుండా ,ఎక్కడికి వెల్లి పూజలు నిర్వహించని పరిస్థితి ఏర్పడితే ఎలా వుంటుంది అన్నది ఊహించాలని ఆన్నారు. మేధావులు, ప్రభుత్వ పెద్దలు బ్రాహ్మణుల రక్షణకు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కృష్ణమూర్తి శర్మ డిమాండ్ చేశారు



## టి యు డబ్ల్యు జె హెచ్ - 143 ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు గా అంజు గౌడ్ (సాక్షి టీవీ), జనరల్ సెక్రటరీ గా గోపి గౌడ్(టీ న్యూస్)







**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి డివిజన్ ప్రతినిధి ఫిబ్రవరి 10:** తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు ఎలక్ట్రానిక్ మీడియా (టెంజ్)అధ్యక్షుడిగా దొమ్మాటి అంజు గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా ఎనుగందుల గోపి గౌడ్,కోశాధికారిగా పెంబి మహేశ్ (ఐ న్యూస్ )ను ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడలో ఆదివారం టియూడబ్ల్యూజే హెచ్ 143 మహాసభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ హాజరు కాగా యూనియన్ నూతన కమిటీ లను ఎన్నుకున్నారు, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టెంజ్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ టీచర్స్

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి శక్తి చాటి చెప్పాలి



**కాంగ్రెస్ బిఆర్ఎస్ ల పని అయిపోయింది**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి ఫిబ్రవరి 10:** జరగబోయే గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి శక్తి చాటి చెప్పాలని బిజెపి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజి రెడ్డి, మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించడానికి కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. జమ్మికుంట బిజెపి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున స్థానికంగా ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్ షాప్ ప్రోగ్రాం నిర్వహించగా ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ను, ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్స్ ల సమస్యలను గాలికి వదిలేసిందని అన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులకు కాంగ్రెస్ హామీ ప్రకారం రావాల్సిన నిరుద్యోగ భృతి రూపాయలు నాలుగు వేల రూపాయలు నేటికీ ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం 56000 బాకీ పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ట భద్రులకు ఎలాంటి ఉపాధి చూపెట్టకుండా,నిరుద్యోగ భృతి ఇవ్వకున్న పట్టభద్రులు ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేస్తే తీవ్రంగా నష్టపోతారని, భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే నిరుద్యోగ పట్టభద్రులు ను మోసం చేసిన కాంగ్రెస్ కు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. విద్యార్థుల, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడింది కేవలం బిజెపి యే అన్నారు. అందుకే జరగబోయే ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, బిజెపి జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నరసింహ రాజు, బింగి కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విద్యాసాగర్ రెడ్డి,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యం రావు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి మండల అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, బత్తిని నరేష్,బైరెడ్డి రమణారెడ్డి, తూర్పాటి రాజు, ర్యాకం శ్రీనివాస్,జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, మాజీ మండల అధ్యక్షులు జీడి మల్లేష్, రామిడి ఆదిరెడ్డి, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గోవిందారం పాఠశాల విద్యార్థి ఎంపిక



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి ఫిబ్రవరి 10:** జగిత్యాల జిల్లా భీమారం మండల గోవిందారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి బండపల్లి యశ్వంత్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ లక్ష్మీరాం నాయక్ ప్రకటించారు. మెదక్ లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన చేసి మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నాడని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంత్ తెలియజేశారు ప్రధానోపాధ్యాయులు అష్ఫాక్ హుస్సేన్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు . ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయమని జాతియ స్థాయిలో కూడా గొప్ప ప్రదర్శన చేయాలని జశ్వంత్ కు షూ ప్రధానం చేశారు పాఠశాల హిందీ ఉపాధ్యాయులు అబ్దుల్ మజీద్ క్రీడా దుస్తుల ను బహుకరించారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు విద్యార్థిని అభినందించారు

## మంగమ్మ గూడెం గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు మండల ప్రతినిధి ఫిబ్రవరి 10:** అడ్డ గూడూరు మండల పరిధిలోని మంగమ్మ గూడెం గురుకుల పాఠశాలలో సోమవారం అడ్డ గూడూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా 55 మంది విద్యార్థులకు ఉచిత వైద్యం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సరోజన, ఎఎన్ఎం మరియ రాణి, ఆశ సునీత, తదితరులు పాల్గొన్నారు

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజీనా చౌదరి**



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు మండల ప్రతినిధి ఫిబ్రవరి 10:** అడ్డ గూడూరు మండల పరిధిలోని మంగమ్మ గూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పిజిటి మాథ్స్ సబ్జెక్ట్ బోధించుటకు అథితి అధ్యాపకులుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజీనా చౌదరి సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. అతిథి అధ్యాపక పోస్టులో చేరడానికి కావలసిన అర్హతలు ఎమ్మెస్సీ మ్యాథ్స్ మరియు బీఈడీ పూర్తి చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు కళాశాల ప్రిన్సిపాల్ విజీనా చౌదరి సెల్ నెంబర్ 7032814727 కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.

## ప్రయాగ రాజ్ మహా కుంభమేళకు బయలుదేరిన జమ్మికుంట వాసులు





**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి ఫిబ్రవరి 10:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శివాలయం బొమ్మల గుడి నుండి గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో మహా కుంభమేళాకు బయల్దేరారు . పట్టణంలోని విశ్వేశ్వర ఆలయం నుండి అయోధ్య ప్రయాగశాల పీఠం చాందా మహంకాళి దేవాలయం కాశీ గయా దేవాలయాలకు దర్శనం కోసం జమ్మికుంట పట్టణం నుండి 40 మంది ప్రయాణికులతో బయలుదేరారు .ఈ కార్యక్రమంలో పంతాటి రవీందర్ తిరుమల దంపతులు గౌతమి శిరీష సముద్రాల ఐలయ్య మద్ది రాజన్న దంపతులు పంతాటి పుష్ప లీల కాటం వీరస్వామి లక్ష్మి దంపతులు వీరెల్లి మల్లక్క పుట్ట ముక్కుల మల్లక్క లక్ష్మి నాల కంటి సరోజన మాడి శెట్టి వనమాల పంజాల సరోజన దుంప మల్లయ్య అన్నపూర్ణ వెంకట మల్లయ్య రాజమణి జంగ మధు కొండవేన సమ్మయ్య జంగ కనకయ్య మధుకర్ తదితరులు ప్రయాణమయ్యారు

## నామినేషన్ వేసిన బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య

భారీగా ర్యాలీ... తరలివచ్చిన ఉపాధ్యాయులు....

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక నవుతా ....

బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య







**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు ఫిబ్రవరి 10:** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక అవుతానని,కరీంనగర్, ఆదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి మల్క కొంరయ్య అన్నారు. సోమవారం రోజున కరీంనగర్ పట్టణం లో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అనంతరం కరీంనగర్ లోని ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలు గా మారాయన్నారు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రెండు ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు కేవలం జీతాలు పొందుతున్నారే తప్ప ఏ సౌకర్యాలు పొందడం లేదన్నారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ చెందుతున్న ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యూటి, జిపిఎఫ్, సరెండర్ లీవ్ డబ్బులు, పిఆర్ సి ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. బి ఆర్ఎస్ , కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఏనాడు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల కోసం కొట్లాడింది లేదని, శాసన మండలిలో మాట్లాడింది లేదన్నారు. ఆ రెండు పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందున జరగబోయే ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అవకాశం కల్పించాలని కోరారు.. అనంతరం మాజీ శాసనసభ్యులు , టీచర్స్ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు జరగబోయే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్య కు అవకాశం ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు అనంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు పోలి సత్యనారాయణ నరేంద్ర రావు కృష్ణవేణి , ఉపాధ్యాయులు, అభిమానులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

అర్చకుడు రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. రంగరాజన్... నమస్తే సర్, నమస్తే అనగానే... ముఖ్యమంత్రి “నమస్తే అయ్యగారూ” అని పలకరించారు. ఇలాంటి ఘటన జరిగినప్పుడు చెప్పాల్సింది కదా అని ముఖ్యమంత్రి అడగగా... మీరు ఉన్నారు, పోలీసు వ్యవస్థ బాగా పనిచేస్తోందని రంగరాజన్ అన్నారు. పోలీసులు బాగా స్పందించారని కితాబునిచ్చారు.

మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యేకు కూడా సూచన చేశానన్నారు. ఒకసారి వీలు చూసుకొని చిలుకూరు బాలాజీ ఆలయానికి వస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సహకారం అవసరమైతే తమకు చెప్పాలని ఆయన అన్నారు.

రాజేంద్రనగర్ డీసీపీ మాట్లాడుతూ..

మరోవైపు.. చిలుకూరు శ్రీబాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి సంబంధించిన అంశాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో వివరించారు. ప్రధాన నిందితుడు కొవ్వూరి వీర రాఘవరెడ్డిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, తన సంస్థలో హిందువులను చేర్పించాలంటూ రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ దాడి చేసిందని తెలిపారు. అయితే 2022లో రామరాజ్యం పేరుతో సోషల్ మీడియాలో సంస్థను కొవ్వూరి వీర రాఘవ రెడ్డి ప్రారంభించారని చెప్పారు. ఆ క్రమంలో సోషల్ మీడియాలో భగవద్గీత శ్లోకాలతో పాటు హిందువులు.. ఈ సంస్థలో చేరే విధంగా వీడియోలు పోస్ట్ చేశాడన్నారు. ఈ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ. 20 వేలు జీతం ఇచ్చే విధంగా ప్రకటనలు చేశాడని తెలిపారు. ఈ నేపథ్యంలో రాఘవ రెడ్డి మాటలు నమ్మి దాదాపు 25 మంది ఈ రామరాజ్యం ఆర్మీలో చేరారన్నారు. ఈ జనవరి 24వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు పట్టణంలో వీళ్ళంతా సమావేశమయ్యారని వివరించారు. ఇక గుంటూరు జిల్లా కోటప్పకొండలో తల రూ. 2 వేలు చెల్లించి యూనిఫామ్ కుట్టించుకున్నారని తెలిపారు. అయితే ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం వీరంతా చిలుకూరుకు మూడు వాహనాల్లో వెళ్లి.. రంగరాజన్‌పై దాడి చేశారన్నారు. అయితే వీరంతా ఈ దాడికి పాల్పడే ముందు యాప్రాల్‌లో కలిసి ఫోటోలు దిగారన్నారు. నల్లని దుస్తులు ధరించిన 20 నుంచి 25 మంది రంగరాజన్ నివాసానికి మూడు వాహనాల్లో వచ్చారని చెప్పారు. ఆర్థికంగా సపోర్ట్ చేయడంతోపాటు “రామరాజ్యం ఆర్మీ”లో వ్యక్తులను రిక్రూట్ చేయాలంటూ రంగరాజన్‌ను వారు డిమాండ్ చేశారన్నారు.

అందుకు ఆయన అంగీకరించ లేదన్నారు. దీంతో ఆయనపై దాడి చేశారని.. దీంతో ఫిబ్రవరి 8వ తేదీన తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. అయితే అదే రోజు.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వీర రాఘవరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ఈ రోజు.. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మహిళలతోపాటు ఐదుగురిని అరెస్టు చేసామని వివరించారు. చిలుకూరు శ్రీబాలాజీ దేవాలయం తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందింది. ఈ దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొనేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అలాంటి దేవాలయంలో రంగరాజన ప్రధాన అర్చకుడిగా ఉన్నారు. ఆయన తండ్రి సౌందర్ రాజన్ సైతం ఇదే దేవాలయంలో అర్చకునికా విధులు నిర్వహించారు.

## విద్యుత్ షాక్ కు గురైన బాధితుల కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి నర్సింగరావు





**షణ్ముఖ వెలుగు కోరుట్ల రూరల్ ప్రతినిధి ఫిబ్రవరి 10:** కోరుట్ల మండలం లోని జోగన్ పల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురైన కొండూరి శ్రీధర్(30) తేలు మణిదీప్ (14) లను సోమవారం రోజున కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు పరామర్శించారు. తేలు మణిదీప్ ఆపరేషన్ నిమిత్తం ఇప్పటివరకు సుమారు 30 లక్షల వరకు ఖర్చు అయిందని బాధిత కుటుంబ సభ్యులు తెలుపగా జువ్వాడి నర్సింగరావు స్పందిస్తూ ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ పెద్ద మొత్తంలో మంజూరు చేయించడానికి కృషి చేస్తానని విద్యుత్ ఘాతానికి గురైన రెండు కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, కోరుట్ల మండల అధ్యక్షులు కొంతం రాజం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ,కోరుట్ల నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి,కోరుట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రాల హరీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు బలవంత రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు సహదేవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సైదు గంగాధర్, బద్దం గౌతం రెడ్డి, బద్దం నారాయణ ,ఇంద్రాల అశోక్, తేలు రాజ్ కుమార్, పోతవేని శేఖర్,దులూరి రాజేశం, పెంద్యాల రవి ముత్యపు రాజ శేఖర్,నక్క నర్సయ్య,ఇంద్రాల రాజ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ తాండ్ర కుమార్ వర్ధంతి ని జయప్రదం చేయండి

ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్

ఫిబ్రవరి 14 న మియాపూర్ టేక్ నరసింహ నగర్ లో విగ్రహావిష్కరణ- సభ కరపత్రం విడుదల



**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 10:** ఎం సిపిఐ (యు) పొలిట్ బ్యూరో సభ్యుడు,తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ 3 వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 14 నుండి 21 వరకు జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించి మియాపూర్ టేక్ నరసింహ నగర్ లో సోమవారం సాయంత్రం కరపత్రం విడుదల చేసిన అనంతరం వనం సుధాకర్ మాట్లాడుతూ... ఎం సిపిఐ (యు)పోలిటి బ్యూరో సభ్యులుగా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో అనారోగ్యంతో బాధపడుతూ 2022 ఫిబ్రవరి 14న అమరులైన కామ్రేడ్ తాండ్ర కుమార్ 3వ వర్ధంతి కార్యక్రమాన్ని 2025 ఫిబ్రవరి 14 నుండి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా “భూమి ఇండ్లు ఇళ్ల స్థలాలు ప్రభుత్వ విధానాలు మన కర్తవ్యం అనే అంశంపై సభలు సమావేశాలు జరుపుతున్నామని తెలియజేశారు. ఫిబ్రవరి 14 న మొదటి రోజు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మియాపూర్ క్రాస్ రోడ్డు వద్దగల తాండ్ర కుమార్ భారీ స్తూపం నుండి టేకు నరసింహా నగర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం టేకు నర్సింహా నగర్ లో కామ్రేడ్ తాండ్ర కుమార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అనంతరం సభ జరుగుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి ఎం సిపిఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్, బిఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, వామపక్ష కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నాయకులు మరియు ఎం సిపిఐ(యు) రాష్ట్ర నాయకత్వం, వివిధ జిల్లాల నుండి పార్టీ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు హాజరవుతున్నారని తెలియజేశారు. భూమి,ఇండ్లు,ఇళ్ల స్థలాల కోసం, పేద ప్రజల విముక్తి కోసం పాలకవర్గాల తప్పుడు విధానాలపై కామ్రేడ్ తాండ్ర కుమార్ రాజి లేని పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి గత టిఆర్ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలు భూమి ఇండ్లు ఇళ్ల స్థలాలు అంశంపై ప్రజలను మోసగిస్తూ వస్తుందని ఇది తప్పుడు వాగ్దానాలకు తోడుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా మోసం చేస్తుందని ఈ పాలక దోపిడి అవకాశ వాద ప్రభుత్వాల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ తాండ్ర కుమార్ మూడవ వర్ధంతి సందర్భంగా ప్రజా చైతన్య కార్యక్రమం చేపడతామని ఆయన తెలియజేశారు.

ఈకార్యక్రమంలో ఎం సిపిఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, వర్గ సభ్యులు.తాండ్ర కళావతి,కర్ర దానయ్య, ఇస్లావత్ దశరథ్ నాయక్,పల్లె మురళి,వి తుకారాం నాయక్, కమిటీ సభ్యులు పి భాగ్యమ్మ డివిజన్ నాయకులు, శివాని, నర్సింహా, వి అనిత, శంకర్,బి పార్వతి, ఇషాక్,టి ఎన్ నగర్ వాసులు కప్పర రమేష్, చంద్రకళ, సి హెచ్ క్రిష్ణ, శ్రీను, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో హుజురాబాద్ విద్యార్థుల హవా









**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి ఫిబ్రవరి 10:** హైదరాబాద్ ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మార్షల్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో గ్లోబల్ షోటో ఖాన్ కరాటే డూ ఇండియా హుజురాబాద్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 12 సంవత్సరాల బ్లాక్ బెల్ట్ కేటగిరి కటాస్ లోఎస్.కె షాదుల్లా బాబా గోల్డ్ మెడల్, 15 సంవత్సరాల అమ్మాయిల విభాగంలో ఆరెంజ్ కేటగిరిలో కటాస్ జన్ను కావ్య గోల్డ్ మెడల్, 14 సంవత్సరాల అమ్మాయిల విభాగంలో కటాస్ లో ఓ సన్నిహిత గోల్డ్ మెడల్, 8 సంవత్సరాల విభాగంలో అమ్మాయిల కేటగిరి కటాస్ లో హమేరా తస్లీ గోల్డ్ మెడల్, 13 సంవత్సరాల అబ్బాయిల విభాగంలో వైట్ బెల్ట్ కేటగిరీ లో ఆదిత్య వర్ధన్ గోల్డ్ మెడల్, 11 సంవత్సరాలు ఎల్లో బెల్ట్ కేటగిరీలో సిహెచ్ సాయి చరణ్ కటాస్ లో సిల్వర్ మెడల్, ఆరు గోల్డ్ మెడల్స్, ఒకటి సిల్వర్ మెడల్ ఈ కరాటే పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారని అన్నారు. ఈ విద్యార్థులను హుజురాబాద్ టౌన్ సిఐ తిరుమల్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, తెలంగాణ రిటైర్డ్ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్దన్, టౌన్ ఎస్సై యూసుఫ్ అలీ, ఎఎంసి మాజీ డైరెక్టర్ ఖాలిద్ హుస్సేన్, మైనార్టీ నాయకుడు మహమ్మద్ అలీమ్, జ్యోతిరావు పూలే కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్ పటేల్, ఫ్రూట్స్ వ్యాపారి మొహమ్మద్ సలీం, న్యూ కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ బి రాజ్ కుమార్, డైరెక్టర్స్ టీ గోపాల్, ఏం వెంగళ రావు, గ్లోబల్ షోటో ఖాన్ కరీంనగర్ జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అంబాల ప్రభాకర్, తులసి లక్ష్మణా మూర్తి తదితరులు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుటుంబంలో విషాదం







**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి ఫిబ్రవరి 10:** నిన్న రాత్రి అనారోగ్యంతో మరణించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వదిన బండారి పద్మ పార్థివ దేహాన్ని సైనిక్ పూరి లోని తన నివాసంలో సందర్శించి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేసిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే సుభాస్ రెడ్డి ,మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, పలువురు నాయకులు మాట్లాడుతూ త్వరలో వారి ఇంట్లో శుభకార్యం పెట్టుకుని ఇలాంటి సంఘటన వారిని ఎంతో కలిసి వేసిందని వారు తెలియజేశారు అనంతరం వారి కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని వారు కోరుకున్నారు పార్టీ రాష్ట్ర నాయకులు స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.